
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 7 జూన్ 2024

మొదలైన బడిబాట 8లో..
కలెక్టర్‌కు టీఎన్‌జీవోల సన్మానం 8లో..

ఇక బదిలీలు

- కోడ్ ముగియడంతో అధికారులకు స్థాన చలనం
- కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు
- ప్రభుత్వ శాఖల్లో సిద్ధమవుతున్న జాబితా



జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీకి రంగం సిద్ధమవుతోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పూర్తి కావడంతో ఎన్నికల కోడ్ ముగియగా రాష్ట్ర ప్రభుత్వం అధికారుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఈ నెల 4వ తేదీన వెలువడినప్పటికీ ఈ నెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. ఆ తర్వాత ఒక్కో శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ మొదలు కానుంది. జిల్లాలో మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న అధికారులకు స్థానచలనం కలగనున్నట్లు ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల్లో సుమారు 60 నుంచి 100 మంది వరకు బదిలీ చేసేందుకు రంగం సిద్ధమవుతోందని తెలుస్తోంది.

ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగులు

పూర్తి స్థాయిలో బదిలీలు లేక ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగాలు చేస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. సొంత జిల్లాలు, కుటుంబాలకు దూరంగా ఉంటూ జగిత్యాల జిల్లాలో విధులు నిర్వహిస్తున్న అధికారులంతా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా సొంత జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన వారంతా తిరిగి జగిత్యాల జిల్లాకు వచ్చేందుకు



అవకాశాలు వెతుక్కుంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారంతా దాదాపు బదిలీలపై వచ్చిన వారే. ఈ క్రమం లో పాలన సజావుగా సాగాలంటే దూర ప్రాంతాల వారిని తిరిగి కోరుకు న్న చోటుకు పంపేందుకు అవకాశం ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

ఇతర శాఖల్లోనూ...

రెవెన్యూతో పాటు సాధారణ పరిపాలన, విద్య, వైద్యం, మున్సిపల్, గ్రామ పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, సాగునీటి, వ్యవసాయ, ట్రెజరీ, సహకార, పశు సంవర్ధక, పౌరసరఫరాల, సంక్షేమ శాఖలతో పాటు ఇతర అన్ని విభాగాల్లో పనిచేస్తున్న అధికారులకు బదిలీలు ఉండనున్నాయి. దీంతో జిల్లా పరిధితో పాటు జోన్, మల్టీ జోన్ పరిధిలో పని చేస్తున్న అధికారులు అనుకూల మైన చోట పోస్టింగ్ కొరకు పోటీ పడుతున్నారు. మరోవైపు కొందరు అనారోగ్యం, ప్రత్యేక పరిస్థితుల్లోనూ బదిలీల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేప థ్యంలో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ వస్తుందోనని అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

రెవెన్యూ ఉద్యోగుల్లో టెన్షన్

ఎన్నికల కీలకంగా వ్యవహరించిన రెవెన్యూ శాఖలో పూర్తిగా బదిలీ లు సాగే అవకాశం ఉంది. రెవెన్యూ శాఖకు చెందిన పలువురు అధికా రులు రిటర్నింగ్ అధికారులుగా, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఉన్నారు. డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్, ఆర్‌డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆపై ఆఫీసర్లకు బదిలీ జరిగే అవకాశం ఉంది. దీంతో జగిత్యాల జిల్లా నుంచి కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కామారెడ్డి, మంచిర్యాల తదితర జిల్లాలకు బదిలీపై వెళ్లిన రెవెన్యూ అధికారులు తిరిగి తమ స్థానాల కొరకు ముమ్మరంగా ప్రయ త్నాలు చేస్తున్నారు. ఇక పైరవీల ప్రభావంతో ఎవరికి ఎక్కడ పోస్టింగ్ దక్కుతుందోనని కొందరు టెన్షన్ పడుతున్నారు. మారుమూల మండ లాలతో పాటు ఇతర జిల్లాలకు కలెక్టరేట్‌లో ఆయా సెక్షన్ల ఇన్‌చార్జీ లుగా, ఆర్‌డీఓ, ఇతర రెవెన్యూ కార్యాల యాల్లో సూపరెండెంట్‌లు పోస్టులకు బదిలీ చేస్తారనే గుబులుతో ఉన్నారు. కొం దరు జగిత్యాల కలక్టరేట్‌తో పాటు ఇతర కార్యాలయాల్లో కీలక శాఖల్లోనూ ఏళ్లుగా తిష్టవేసి పనిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినప్పటికీ సీట్లు వదలడం లేదు. ఇక కొందరు ఉన్నతాధికారులను మచ్చిక చేసు కొని కోరుకున్న చోట కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఇలాంటి అధికారులకు బదిలీలు ఉండాలని సహచర ఉద్యోగులే కోరుతున్నారు.

పోస్టింగ్ కోసం పైరవీలు

పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల వద్ద పైరవీలు చేస్తున్నారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ఎస్ఐ, సీఐ, డీఎస్పీ వరకు ఎన్నికల సమయంలో చాలా మంది బదిలీపై వచ్చారు. అదే సమయంలో జిల్లాలో పని చేస్తున్న పోలీసు అధికారులు ఇతర జిల్లాల కు వెళ్లారు. కొందరు పోలీసు అధికారులు జిల్లాలోనే ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. వారంతా మళ్లీ తమ పోస్టు ల్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొందరు పోలీసు అధికారులు రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న వారు, తమ బంధువులు, తెలిసిన వారితో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నా లు చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యేల సిఫారుసు మేరకు ప్రాధాన్యత ఇవ్వడంతో కొందరికి పోస్టింగ్‌లు దక్కాయి. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులోనూ అదే సిఫారుసుల పద్ధతి కొనసాగుతుందా..లేదా అన్న విషయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి వారు ప్రయత్నాలు చేసు కుంటున్నారు. పోలీసు శాఖతో పాటు ఎక్సైజ్, ఆర్‌టీఏ, ఫైర్, ఫారెస్టు వంటి యూనిఫాం సర్వీసులో ఉన్న అధి కారులు సైతం మంచి పోస్టింగ్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు.

బీసీజీ టీకాపై వైద్య సిబ్బందికి అవగాహన



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్

జగిత్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం జిల్లాలోని వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఇతర సిబ్బందికి బీసీజీ టీకాపై అవగాహన, శిక్షణ, అధ్యయనం కార్యక్రమాన్ని రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి మండలంలో ఇంటింటి సర్వే నిర్వహించి బీసీజీ టీకా లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో నిబంధన మేరకు గుర్తించిన వారికే బీసీజీ టీకా వేయడం జరుగుతుందని, జిల్లా స్థాయిలో శిక్షణ అనంతరం మండల స్థాయిలో వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఉంటాయని తెలిపారు. బీసీజీ టీకా ఉపయోగాలు, నిర్వహణ తదితర అంశాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్, పీపీఎం హరీశ్, డీపీఓ స్వామి, సత్యనారాయణ, డీడీఎం వేణు, జిల్లాలోని వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి

రాయికల్, జూన్ 6: తమ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాయికల్ పట్టణంలోని 11వ వార్డు ప్రజలు రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. వార్డులో డ్రైనేజీ పేరుకుపోయిందని, తాగునీటి సమస్య తీర్చాలని, సీసీ రోడ్డును నిర్మించాలని కోరారు. మా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. అలాగే కాలనీలోని ఓ వ్యక్తి తాగునీటి ట్యాంక్‌తో పాటు ఎలాంటి వాహనాలు వచ్చినా బెదిరింపులకు గురిచేస్తున్నాడని పేర్కొన్నారు. ఆ వ్యక్తిపై చర్యలు తీసుకుని మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాజవ్వ, రమేష్, రవీందర్, అఖిల, వెంకటరమణ, ఆనందం, సత్యనారాయణ, స్వప్న, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించిన ఈఈ



పనులు పరిశీలిస్తున్న ఈఈ

రాయికల్, జూన్ 6: రాయికల్ పట్టణంలోని ఉర్దూ మీడియం, ఒడ్డెర కాలనీ, ఇందిరానగర్‌కాలనీ అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను జగిత్యాల ఈఈ నారాయణరెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు. పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా పనులు పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట డీఈ భాస్కర్, ఏఈ వినయ్ కుమార్ ఉన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉండాలి

- అడిషనల్ ఎస్పీ వినోద్ కుమార్



ఆర్థిక సహాయం అందిస్తున్న అడిషనల్ ఎస్పీ

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న నిరుపేదలకు అందించే గోరంత సాయం..పలు సందర్భాల్లో కొండంత అండగా నిలుస్తుందని జగిత్యాల అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన యాంసాని భాగ్యలక్ష్మీ అనే నిరుపేద దివ్యాంగురాలుకు అవోపా జిల్లా అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ ద్వారా పలువురు వద్ద నుంచి సేకరించిన రూ.70 వేల నగదును ఆర్థిక సహాయంగా అందించారు. భాగ్యలక్ష్మీ దివ్యాంగురాలు కావడం, తల్లిదండ్రులు, పిల్లలు, భర్త ఎవరూ లేకుండా చేతిలో చిల్లిగవ్వ లేకుండా బతుకు దెరువు గురించి పడుతున్న అవస్థను తెలుసుకున్న అవోపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఓ వాట్సాప్ గ్రూప్ ద్వారా పలువురు దాతల నుంచి రూ.70 వేల నగదును సేకరించారు. సదరు నగదును అడిషనల్ ఎస్పీ వినోద్‌కుమార్ చేతుల మీదుగా ఆమెకు అందించారు. నిరుపేద మహిళా దివ్యాంగురాలికి బతుకుదెరవు గురించి ఆర్థిక సాయం అందించేలా కృషి చేసిన అవోపా జిల్లా అధ్యక్షుడు, ఎస్బీ ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్‌ను ఏఎస్పీ వినోద్‌కుమార్ అభినందించారు.

మున్సిపల్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ

- రెవెన్యూ విభాగానికి చెందిన ఫైళ్లను పరిశీలించిన పోలీసులు



మున్సిపల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఐ నరేశ్

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం పోలీసులు పలు రికార్డులను పరిశీలించారు. మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో అక్రమాలు, అవినీతి చోటుచేసుకున్నాయని, నిబంధనలకు వ్యతిరేకంగా ఓ స్థలానికి చెందిన రికార్డులను తారుమారు చేశారని వచ్చిన ఫిర్యాదు మేరకు జగిత్యాల టౌన్ ఎస్ఐ నరేశ్ పరిశీలన జరిపారు. రెవెన్యూ విభాగంలోని పలు ఫైళ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఛాంబర్‌లో పరిశీలించారు. అదే విధంగా రెవెన్యూ విభాగంలో సైతం తనిఖీలు చేసి ఫైళ్లను పరిశీలించారు. పట్టణంలోని నిజామాబాద్ రోడ్డు వైపున గల రూ. లక్షలు విలువ చేసే ఓ ప్రైవేటు స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా రికార్డులు మార్పు చేసి స్వాధీనం చేసుకున్నారన్న ఫిర్యాదు మేరకు పరిశీలన జరిపారు. సుమారు రెండు గంటల పాటు మున్సిపల్ కార్యాలయంలో పోలీసుల పరిశీలన జరిగింది. మున్సిపల్‌లో పోలీసులు పరిశీలన జరపడం చర్చనీయాంశంగా మారింది. ఇదే వ్యవహారంలో నిందితునిగా అనుమానిస్తూ పోలీసులు మున్సిపల్‌కు చెందిన ఓ కీలక అధికారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై టౌన్ ఎస్ఐ నరేశ్ మాట్లాడుతూ మున్సిపల్ రికార్డుల మార్పుపై వచ్చిన ఫిర్యాదు మేరకు పరిశీలన జరుపుతున్నామని తెలిపారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- మేడిపల్లి మండల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

మేడిపల్లి, జూన్ 6: అధికారులు అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మండలంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో ఫ్రెండ్లీగా ఉంటుందని అన్నారు. సమస్యలను సభదృష్టికి తెచ్చినప్పుడు పరిష్కరించడం అధికారి బాధ్యత అన్నారు. వర్షకాలం సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేలా వైద్యులు కృషి చేయాలని ప్రసవాలు ప్రభుత్వ అసుపత్రిలోనే జరగాలని ఆదేశించారు. మహిళలకు ఉపాధి కల్పించేందు వారికి శిక్షణ, ఉపాధి కల్పనకు ఒక కార్యక్రమాన్ని రూపొందించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషిచేలని కోరారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరన్‌రావు, ఎంపీపీ ఉమాదేవి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ధర్మపురి మండల సభ వాయిదా

ధర్మపురి, జూన్ 6: ధర్మపురి మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ధర్మపురి ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు అధ్యక్షతన గురువారం జరగాల్సిన సమావేశం సభ్యుల కోరం లేకపోవడం వల్ల వాయిదా పడింది. తిరిగి ఈ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహిస్తారనేది తేదీ త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో రవీందర్ తెలిపారు.

సెలవులో జగిత్యాల మున్సిపల్ కమిషనర్

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ కమిషనర్ అనిల్ గురువారం సెలవుపై వెళ్లారు. మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, రూ. లక్షల విలువ చేసే స్థలాన్ని కాజేయడానికి ప్రయత్నించారని ఓ బాధితుడు కలెక్టర్, పోలీసు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లకు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ షురూ కావడంతో ఆందోళనకు గురైన కమిషనర్ అనిల్ సెలవుపై వెళ్లినట్లు సంబంధిత వర్గాలు అంటున్నాయి. మున్సిపల్ ఇన్‌చార్జి డీఈ యాదగిరికి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ అనిల్ సెలవు పెట్టాడు. జగిత్యాల నుంచి ఇతర మున్సిపల్‌కు బదిలీ కొరకు కమిషనర్ అనిల్ ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. కాగా ఇంచార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించడానికి ఇన్‌చార్జి డీఈ యాదగిరి ఆసక్తిగా లేరని మున్సిపల్ వర్గాలు పేర్కొంటున్నాయి. కలెక్టర్ యాస్మిన్ భాషాను మున్సిపల్ ఇంచార్జి డీఈ యాదగిరి కలిసి బాధ్యతలు అప్పగించవద్దని కోరడానికి సమాయత్తం అవుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఇన్‌చార్జి డీఈ యాదగిరి మాట్లాడుతూ కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నానని, దీనికి తోడు కరీంనగర్ మున్సిపల్‌లో ఈఈగా వారంలో మూడు రోజుల పాటు, జగిత్యాల మున్సిపల్‌లో డీఈగా వారంలో మూడు రోజుల పాటు విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఇంచార్జి కమిషనర్ బాధ్యతలు నిర్వర్తించ లేనని, మినహాయింపు ఇవ్వాలని కలెక్టర్ యాస్మిన్ భాషాను కోరుతానని తెలిపారు. ఇదిలా ఉండగా కమిషనర్ అనిల్ సెలవులో వెళ్లడానికి కొద్ది సమయానికి ముందు ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాలకు చెందిన సుమారు రెండు వందల చెక్‌లపై సంతకాలు చేసి వెళ్లారని, ఇందులో సైతం పలు అక్రమాలు, అవినీతి చోటుచేసుకున్నాయని మున్సిపల్ వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, జూన్ 6: రాష్ట్రంలో ప్రతి పౌరునికి మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. పెగడ పల్లి మండలంలోని ల్యాగలమర్రి గ్రామానికి చెందిన లక్ష్మి అనా రోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరి వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు రూ. లక్షా ముప్పై వేలు మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు గురువారం ఎల్‌వోసీ అందజేశారు.

పలకరించిన తొలకరి

- జిల్లాలో పలుచోట్ల వర్షం



జగిత్యాలలో కురుస్తున్న వర్షం

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో పలు చోట్ల గురువారం ఈదురు గాలులతో వర్షం కురిసింది. కొన్ని రోజులుగా ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనం వాతావరణం చల్లబడడంతో ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా కేంద్రంలో సుమారు అరగంట పాటు కురిసిన వర్షం వల్ల రహదారులు జలమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు నిలిచింది. నిన్న మొన్నటి వరకు వేసవి ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్న జనం వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు. తొలకరి జల్లులు కురుస్తుండటంతో రైతన్నలు దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు నాటుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా



పొలాస బడిబాటలో పాల్గొన్న కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా

జగిత్యాలరూరల్, జూన్ 6: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగిత్యాల కలెక్టర్ షేక్ యాస్మిన్‌భాషా అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో డీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, డీఆర్‌డీఓ సంపత్‌రావు, డీపీఓ దేవరాజు, ఎంపీడీఓ రమాదేవి, తహసీల్దార్ రాంమోహన్, ఎంఈఓ గాయత్రి, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- మహిళా సాధికారతకు అండగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తుందని కలెక్టర్ షేక్ యస్మిన్‌భాషా అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో మహిళా సంఘాలచే రూపొందిస్తున్న విద్యార్థుల ఏకరూప దుస్తుల తయారీని పరిశీలించారు. గ్రామ సంఘాల సభ్యులు చక్కటి కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ సంపత్‌రావు, డీఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, డీపీఓ దేవరాజు, తహసీల్దార్ రాంమోహన్, ఎంపీడీఓ రమాదేవి, ఎంఈవో గాయత్రి, ఏపీఎం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'సుపరిపాలనకు దేశ ప్రజల పట్టం'

కథలాపూర్, జూన్ 6 : దేశ ప్రజలు నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయేకు మూడోసారి పట్టం కట్టారని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ అభివృద్ధిలో తమదైన ముద్ర వేసుకుంటున్న మోదీని ప్రజలు ఆదరిస్తున్నారని అన్నారు. సుపరిపాలనకు ప్రజలు పట్టం కట్టారన్నారు. బీజేపీ పాలనలో దేశం అభివృద్ధి సాధించిందన్నారు. రైతులకు, పేదలకు బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాబోవు ఐదేళ్లలో మరింత అభివృద్ధిని సాధించనున్నామని పేర్కొన్నారు. మోదీపై నమ్మకంతో గెలిపించిన ప్రజ ల నమ్మకాన్ని వమ్ముచేయరని అన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్6: మండలంలోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను రేణికుంట గ్రామం వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎల్ఎండీ ఎస్సై చేరాలు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒకరి అదృశ్యం

మానకొండూర్, జూన్ 6: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన యాళ్ల శ్యాంసుందర్‌రెడ్డి ((44) అనే కారు డ్రైవర్ అదృశ్యం అయినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ముంజంపల్లికి చెందిన శ్యాంసుందర్‌రెడ్డి కారు డ్రైవర్‌గా పని చేస్తు ఆన్‌లైన్ ఆటలు ఆడుతుండేవాడని, దీంతో భార్య జమున మందలించిందని తెలిపారు. దీంతో ఈ నెల 1నుంచి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. అప్పటి నుంచి భర్త ఆచూకీ లేదని గురువారం భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- రూ. 6లక్షల నగదు, మూడు వాహనాలు స్వాధీనం

మెట్‌పల్లి, జూన్, 6 : మెట్‌పల్లి, కోరుట్ల డివిజన్ గ్రామాల్లో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్న దొంగను అరెస్టు చేసి, రూ. 6లక్షల నగదు, మూడు వాహనా లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ నవీన్, ఎస్సై చిరంజీవిలతో కలిసి ఆయన వివరాలను వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆటో నడపడం ద్వారా వచ్చే డబ్బులు కుటుంబ పోషణకు, మద్యానికి, జల్సాలకు సరిపోక సులువుగా డబ్బు సంపాదించాలని దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇందులో భాగంగా మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కోరుట్ల మండలాల పరిధిలోని గ్రామాల్లో గత కొంత కాలం నుంచి హండిల్ లాక్ వేయని ద్విచక్ర వాహనాలను దొంగతనానికి పాల్పడుతు న్నాడు. దొంగి లించిన వాహనాలను నిజామాబాద్, ఆర్మూర్, పెర్కిట్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, గంగాధర పరిధి లోని గ్రామాల్లోని వారికి తక్కువ ధరకు విక్రయించేవాడు. వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతున్నాడు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు డీఎస్పీ పర్యవేక్షణలో మెట్‌పల్లి సీఐ, ఎస్సైలు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పాడి గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం మెట్‌పల్లి పాతబస్టాండ్ సమీపంలో ఎస్సై తన సిబ్బంతో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో షేక్ ఇస్మాయిల్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా వాహనాలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడు దొంగిలించిన వాహనాలను స్క్రాప్‌గా చేసి విక్రయించగా వచ్చిన రూ.6ల క్షల నగదు, మూడు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. దొంగ వాహనాలను కొనుగోలు చేసిన 16మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దొంగను పట్టుకున్న సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి, ఏఎస్సై బేగ్, అంజనేయులు, హెడ్‌కానిస్టేబుల్ అశోక్, సిబ్బంది కిరణ్, సంతోష్‌ను డీఎస్పీ అభినందించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

జీవితంపై విరక్తితో
యువకుడి ఆత్మహత్య

మల్లాపూర్, జూన్ 6: మండలంలోని రాఘవపేట గ్రామానికి చెందిన అలకుంట ప్రవీణ్(19) అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అలకుంట ప్రవీణ్ ఆరు నెలల క్రింతం గల్ఫ్ దేశం దుబాయికి వెళ్లి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి పనిలేక డబ్బులు లేక చేసిన అప్పులు తీర్చలేక తాగుడుకు బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తితో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. హైదరా బాద్‌లో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు గాల్ రెడ్డి హర్షవర్ధన్‌రె డ్డితో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పలువురు పీఆర్‌టీయూ నాయకులు కలిశారు. బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని, జీవో 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిం చాల ని కోరారు. కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గాదె నర్సింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నరుకుల్లా శ్రీధర్, నాయకులు రాజు జాదవ్ పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఏసీపీ క్రిష్ణ

సుల్తానాబాద్, జూన్ 6: రెండు తెలుగు రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ గురువారం అరెస్టు వివరాలను సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన గుర్రం కోటేశ్వర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా కర్లపాడెం మండల కేంద్రానికి చెందిన ఖాజా, ఖమ్మంకు చెందిన వాసు ముగ్గురు కలిసి కొంత కాలంగా దొంగతనాలకు పాల్పడుతూ పోలీసులకు మోస్ట్ వాంటెడ్ వ్యక్తులుగా మారారన్నారు. కోటేశ్వర్ గతంలో జైలుకు వెళ్లిన సందర్భంలో అక్కడ మిగతా ఇద్దరు కలిసి జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలకు పాల్పడే వారని వివరించారు. తెలంగాణలోని ఓ గ్రామంలో దొంగతనం చేసి వెంటనే ఆంధ్ర ప్రదేశ్‌లో కానీ ఇతర జిల్లాల్లో గానీ తలదాచుకుంటారని, ఏపీలో ఒక చోరికి పాల్పడి ఆ వెంటనే జిల్లాలను మారుస్తారని, అవసరమైతే రాష్ట్రాలను కూడా మారుస్తారన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని ఖమ్మంతో పాటు మంచిర్యాల జిల్లా, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల తదితర జిల్లాల్లో అనేక చోరీలకు పాల్పడ్డారని, తాజాగా సుల్తానాబాద్ సర్కిల్ పరిధి పొత్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడ్డారన్నారు. దాంతో పెద్దపల్లి పోలీసులు మూడు బృందాలుగా విడిపోయి ఈ దొంగల ఆచూకీ కోసం ప్రయత్నాలు చేశామన్నారు. రాష్ట్రంలోని అన్ని సీసీఎస్ పోలీస్‌స్టేషన్ల నుంచి వివరాలు సేకరించగా వీరు పాత నేరస్తులుగా తేలిందని, ఆ కోణంలో వారి కోసం వేట కొనసాగించగా ముగ్గురు దొంగలను పట్టుకున్నామని తెలిపారు. వారి నుంచి లక్షా డెబ్బై వేల నగదు, తొమ్మిదిన్నర లక్షల విలువ చేసే పదమూడు తులాల ఆరు గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ పల్సర్ బైక్‌ను వీరు చోరీ చేశారన్నారు. దొంగలను పట్టుకోవడంలో కృషి చేసిన సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, కాల్వశ్రీరాంపూర్, పొత్కపల్లి, జూలపల్లి ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది తిరుపతి, రత్నాకర్, సుధాకర్, రమేష్, రాజు తదితరులను అభినందిస్తూ వారికి నగదు రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో సుల్తానాబాద్ ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ క్రిష్ణ

సౌదీలో వేంపల్లి వాసి ఆత్మహత్య

మల్లాపూర్, జూన్, 6: ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన కందెల వెంకటి(41) అనే వలస కార్మికుడు అప్పుల బాధతో సౌదీ అరేబియాలోని తన గదిలో గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వేంపల్లి గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కందెల వెంకటి చిన్నతనంలో తండ్రి రాజన్న మృతిచెందగా రేకుల షెడ్‌లో ఉంటూ తల్లి గంగరాజు కొద్ది పాటి భూమిలో వ్యవసాయం చేసు కుంటూ పిల్లలను పెంచి పెద్ద చేసింది. కుటుంబ పోషణ భారంగా మారడంతో పెద్దకుమారుడైన వెంకటి అప్పు చేసి ఇరువై ఏళ్ల నుంచి పలు గల్ఫ్ దేశాలకు వెళ్లి వస్తున్నా డు. కొంత కాలం క్రితం పెళ్లి చేసుకోగా ఒక కూతురు, కుమారడు ఉన్నారు. చేసిన అప్పులు తీర్చడానికి సౌదీ అరేబియాలోని ఓ షేక్ వద్ద గొర్లు మేపేందుకు జీతం కుదుర్చుకున్నాడు. వచ్చిన జీతం కుటుంబ పోషణకు, ఖర్చులకు సరిపోతుండడంతో చేసిన అప్పులు తీర్చలేననే బెంగతో కుమిలిపోతుండే వాడని బంధువులు, స్నేహితులు తెలిపారు. గురువారం పనులు ముగించుకుని తన రూమ్‌కు వచ్చిన తర్వాత ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటి మృతి చెందినట్లు స్నేహితులు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతి వార్త విన్న కుటుంబీకులు తీవ్రంగా విలపించారు. వెంకటి మృతదేహాన్ని త్వరగా తెప్పించా లని, నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వెంకటి(ఫైల్)

ట్రాక్టర్ ఢీకొని బాలుడి మృతి

ధర్మారం, జూన్ 6: మండలంలోని దొంగతుర్తి గ్రామంలో గురువారం ట్రాక్టర్ ప్రమాదంలో ఓ బాలుడు మృతిచెందాడు. గురువారం ఉదయం మ్యాన ప్రభాకర్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌ను వెనుకకు నడపడం వలన అతడి మనమడు మ్యాన వేదన్ష్(4) తీవ్ర గాయాలై మృతిచెందాడని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. బాలుడి తండ్రి మ్యాన ఓంకార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు

సైదాపూర్, జూన్ 6: సైదాపూర్ మండలంలోని లస్మన్నపల్లి గ్రామానికి చెందిన మొలుగూరి పోచయ్య అనే రైతుకు విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచయ్య నారు మడికి నీరు పెట్టేందుకు తన వ్యవసా య బావి వద్దకు వెళ్లాడు. బావి వద్దకు కరంటు సరఫరా రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు సరి చేస్తుండగా షాక్‌కు గురై గాయపడ్డాడు. సమాచారం మేరకు కుటుంబసభ్యులు పోచయ్యను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

వేగంగా సుందిళ్ల బ్యారేజీ మరమ్మతు పనులు

- నేడు పరిశీలించనున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంథని/మంథనిరూరల్, జూన్ 6: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని సుందిళ్ల బ్యారేజీ రిపేర్ పనులు వారం రోజులుగా వేగంగా కొనసాగుతు న్నాయి. మండలంలోని సిరిపురం సమీపంలోని గోదావరినదిపై నిర్మించిన సుందిళ్ల బ్యారేజీ రిపేర్ పనులను పరిశీలించడానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 1గంట ప్రాం తంలో వస్తున్నారు. బ్యారేజీ వద్ద జరుగుతున్న రిపేర్ పనులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించిన అధికారులతో ఆరా తీయనున్నారు. అనంతరం భూపాలపల్లి జిల్లాలోని అన్నారం, మేడగడ్డ బ్యారేజీలను సందర్శించడానికి వెళ్లనున్నారు. సుందిళ్ళ బ్యారేజీలో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు బ్యారేజీ ఎగువ, దిగువన సీసీ బ్లాక్‌ల రిపేర్ పనులను నవయుగ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బ్యారేజీ దిగువ ప్రాంతంలో సీసీ బ్లాక్‌లను రిపేర్‌తో సరిచేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో 3, 4, 5 బ్లాక్స్‌లో సీసీ గ్రేడింగ్ పనులను చేపట్టడానికి అందులో ఉన్న నీటిని తీసివేయటానికి కావాల్సిన పనులను నిర్వహిస్తున్నారు. 2022లో వచ్చిన భారీ వరదల కారణంగా బ్యారేజీ ఎగువ ప్రాంతంలో కట్టకు ఒక వైపు గండి పడటంతో దాన్ని పూర్తిస్థాయిలో పూడ్చివేస్తున్నారు. ఈ ప నులను మరో 20 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు వెల్లడిస్తున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో సుందిళ్ల బ్యారేజీ సమీపంలో హెలీప్యాడ్, ఇతర ఏర్పాట్లను అధికారులు చేశారు.



బ్యారేజీ దిగువ ప్రాంతంలో చేపడుతున్న సీసీ బ్లాక్ రిపేర్ పనులు

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

తిమ్మాపూర్, జూన్ 6: మండలంలోని మహాత్మానగర్ గ్రామంలో ఓ వ్యక్తి ఆటోలో అనుమానా స్పదంగా మృతి చెంది ఉన్నాడు. స్థానికులు, ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గునుకుల వెంకటరమణ(66)అనే వ్యక్తి సింగరేణిలో పదవి విరమణ పొందిన అనంతరం కుటుంబం తో కలిసి మండలంలోని మహాత్మానగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటు న్నాడు. కాగా బుధవారం రాత్రి ఎల్ఎండీ కాలనీలో గల గెస్ట్ హౌస్ సమీపంలో అతడు ఆటోలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంకటరమణ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని పరిశీలించగా మృతి చెంది ఉన్నాడు. తన భర్త మద్యం తాగి డీహైడ్రైషన్‌తో మరణించాడా, వేరే కారణలతో మృతి చెందాడా అని అనుమానం ఉందని వెంకటరమణ భార్య జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, జూన్ 6: చోరీ కేసులో ఇద్దరు వ్యక్తులకు ఏడాది జైలు శిక్షతో పాటు100 రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కావేటి సృజన గురువారం తీర్పునిచ్చినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఈ సందర్భం గా సీఐ మాట్లాడుతూ సర్దార్‌నగర్‌కు చెందిన బొట్ల వెంకటస్వామి అనే వ్యక్తికి రగుడు శివారులో ఉన్న భూమి చుట్టూ ప్రహరీ నిర్మించి దానికి గేటును అమర్చారన్నారు. ఆ గేటును 3-8-2023 రోజున దొంగతనం చేశారని పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దొంగతనం చేసిన పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గూడూరి కిరణ్‌కుమార్, మెహెర్‌నగర్‌కు చెందిన షేక్ రియాజ్‌పాషాలను ఆరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. విచారణ అనంతరం విచారణ అధికారి ఎస్ఐ మల్లేశం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారన్నారు. సీఎంఎస్ఎస్ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున చెలుమల సందీప్‌కుమార్ వాదించగా కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరస్థులైన గూడూరి కిరణ్‌కుమార్, షేక్ రియాజ్‌పాషాలకు ఏడాది శిక్షతో పాటు 100రూపాయల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

శంకరపట్నం, జూన్ 6: అనారోగ్యంతో బాధపడుతూ పురుగుల మందు తాగిన శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామా నికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందు తూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆడితం ఐలుకొమురు (24) రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూపించిన వ్యాధి నయం కాలేదు. ఈ నెల 2న నొప్పి తీవ్రం కావడం తో వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఐలుకొమురును హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరా త్రి మృతి చెందాడు. ఐలుకొమురు తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఐలుకొమురు(ఫైల్)

ఇటుక బట్టి వద్ద ప్రమాదంలో చిన్నారి మృతి

మేడిపల్లి, జూన్ 6: మేడిపల్లి మండల కేంద్రంలోని వీఎస్ఆర్ ఇటుక బట్టి వద్ద జరిగిన ప్రమాదంలో నిఖిల్ పోద్ (18నెలలు) చిన్నారి మృతి చెందాడు. ఒరిస్సా రాష్ట్రంలోని పదాన్‌పల్లి గ్రామానికి చెందిన దశరథ్ పోద్ అతని భార్య సారతి పోద్ కలిసి మేడిపల్లిలోని ఇటుక బట్టిలో పనులు చేస్తున్నారు. నిఖిల్ అమ్మమ్మ బసంతి తనను పక్కన కూర్చోబెట్టుకుని పని చేస్తుండగా ట్రాక్టర్ వెనకనుంచి చిన్నారి తలకు తాకింది. గమనించిన యజమాని ప్రసాద్ చికిత్స కోసం జగి త్యాల ఆసుపత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు నిఖిల్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి తల్లి సారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

ఎస్‌యూ ఎల్ఎల్‌బీ పరీక్షల షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జూన్6: శాతవాహన విశ్వ విద్యాలయం ఎల్ఎల్‌బీ నాలుగో, ఆరో సెమి స్టర్, ఎల్ఎల్ఎం 4వ సెమిస్టర్‌లకు సంబంధించిన తేదీలను యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆయన పేర్కొన్నారు.

అంజన్న ముడుపుల ఆదాయం లెక్కింపు

మల్యాల, జూన్ 6: కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ఇటీవల జరిగిన పెద్ద హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు చెల్లించుకున్న ముడుపులను గురువారం దేవస్థానం అధికారులు లెక్కింపు చేపట్టారు. కొబ్బరికాయలు, బియ్యం, డబ్బులను వేర్వేరు చేసి లెక్కింపు చేయగా రూ.2,89,810 నగదు సమకూరినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. నగదుతో పాటు వచ్చిన ముడుపులు కొబ్బరికాయలు, బియ్యంను వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు తెలిపారు. లెక్కింపులో ఏఈవో వై.అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్‌కుమార్, చంద్రశేఖర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు టీఎన్‌జీఓల ఘన సన్మానం



కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను సన్మానిస్తున్న టీఎన్‌జీఓలు

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను జగిత్యాల టీఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భోగ శశిధర్, కార్యదర్శి మిర్యాల నాగేందర్‌ల నేతృత్వంలో పలువురు టీఎన్‌జీఓ నాయకులు ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను పూలమాలలు, శాలువలు, పుష్పగుచ్ఛాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడారు. జిల్లాలో ప్రశాతంగా, పకడ్బందీగా ఎన్నికలు పూర్తి చేయడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా నాయకులు రవి కుమార్, రాజేశం, సుగుణాకర్, మధుకర్, భాస్కర్, శంకర్, శ్రీనివాస్, అయూబ్, కిరణ్, శ్రీకాంత్, మమత, శైలజ, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు నిత్యావసర సరుకులు అందజేత

వెల్గటూర్, జూన్ 6: మండలంలోని శాఖాపూర్ గ్రామానికి చెందిన ఈగం కళావతికి గురువారం తెలంగాణ ఆర్యవైశ్య పేద కుటుంబాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సముద్రాల రమేష్ నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్- సరోజ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కళావతికి 25 కిలోల బియ్యం, సుమారు రూ.3 వేల విలువ గల నిత్యావసర సరుకులు, రూ.2500 నగదు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నరేల్ల రమేష్ గౌడ్, మంచాల గోపాల్, రఫీక్, రాజు, నాగలక్ష్మి, రాజేందర్ పాల్గొన్నారు.

జనసేన గెలుపుపై సంబరాలు

జగిత్యాల అర్బన్, జూన్ 6: ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో పిఠాపురం నియోజకవర్గం నుంచి పోటీ చేసి 70వేల మెజార్టీతో గెలుపొందిన సినీహీరో పవన్‌కల్యాణ్‌కు జగిత్యాల జిల్లా అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ గురువారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల సుప్రీం డ్యాన్స్ స్టూడియోస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కూటమి పొత్తులో భాగంగా 22 స్థానాల్లో జనసేన పోటీ చేసి, 21 స్థానాలు గెలుపొందడం శుభపరిణామం అన్నారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి జనసేన, పవన్‌కల్యాణ్ ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ బాధ్యులు ఎండీ పాషా, శ్యాం గౌడ్, రాజేష్, నాగరాజు, ప్రసాద్, గంగాధర్, శంకర్ తదితరులున్నారు.

ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్‌గా శంకర్



శంకర్‌ను సన్మానిస్తున్న మిత్రులు

జగిత్యాల అర్బన్, జూన్ 6: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జగిత్యాల జిల్లా చైర్మన్‌గా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన జవ్వాజి శంకర్‌ను నియమించినట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి నియామక పత్రం జారీ చేశారు. నూతన చైర్మన్‌గా నియమితులైన శంకర్‌ను జగిత్యాల ఉద్యమకారుల సంఘ సభ్యులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచుపెల్లి రెడ్డి, చిత్తారి మధుకర్, మేడిపెల్లి శేఖర్, రాగుల రాజు, చింతల గంగాధర్, చేని తిరుపతి తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం

కథలాపూర్, జూన్ 6 : మండలంలోని భూషణరావుపేటలో గురవారం కోరుట్ల శ్రీసాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చెవి, ముక్కు, గొంతు వైద్య శిబిరానికి స్పందన కనిపించింది. శస్త్ర వైద్య నిపుణులు మౌనిక, దివ్య ప్రసన్న రోగులను పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేసి చెవి, ముక్కు, గొంతుకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మందిని పరీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఆర్ఎంపీ వైద్యులు బత్తిని శ్రీనివాస్, సాగర్, మోహన్ తదితరులు ఉన్నారు.

విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివ వీధిలో గల విశ్వేశ్వర ఆలయంలో గురువారం శనేశ్వర జయంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో పలు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊటూరి లక్ష్మీ మహేశ్, డాక్టర్ రాజగోపాల్ చారీ, గాదె మల్లి కార్జున్, మంత్రి సత్తయ్య, బండారు లక్ష్మీనారాయణ, పలువురు మహిళా భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ లోపాయకారి ఒప్పందం

● జువ్వాడి కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, జూన్ 6: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీల లోపాయకారి ఒప్పందంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఓటమి పాలయ్యారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జువ్వాడి భవనంలో కోరుట్ల పట్టణ, మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. పార్టీకి జరిగిన నష్టం గురించి చర్చించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన అర్వింద్ అప్పుడు డబ్బులు ఖర్చు పెట్టకపోవడంతోనే ఓడిపోయానని ప్రకటించి ఇప్పుడు భారీ మెజార్టీతో గెలవడానికి ఎంత డబ్బుల ఖర్చు చేశారో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు. కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో ఆరు మాసాల క్రితం గెలిచి ప్రస్తుతం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మూడవ స్థానంకు దిగజారిందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పదం మూలంగానే ఆ పార్టీ మూడవ స్థానంకు చేరుకుందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న రోజుల్లో పార్టీ మరింత బలపరిచే విధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



తాట్లవాయిలో బడిబాట కార్యక్రమం



జాబితాపూర్ గ్రామంలో బడిబాట ర్యాలీ



కొడిమ్యాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

రాయికల్, జూన్ 6: తెలంగాణ ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయికల్ మండలంలోని తాట్లవాయి, భూపతిపూర్ గ్రామాల్లో గురువారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఇంటింటా తిరుగుతూ బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్, ఏపీసీ చైర్మన్ పాలెపు రక్షిత, సెక్రటరీ తిరుమల్ నాయక్, మాజీ సర్పంచ్ రాగి సాగరిక, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, శ్రీధర్, రవి కుమార్, చంద్రకళ, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● జగిత్యాలరూరల్ : జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్, బాలపల్లి అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్, హస్నాబాద్ పాఠశాలల్లో గురువారం బడిబాట ర్యాలీలు నిర్వహించారు. దీనిలో భాగంగా బడిబాట ప్రతిజ్ఞ, ర్యాలీలు నిర్వహించారు.కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రాజ్‌కుమార్, ఎంపీడీఓ విజయలక్ష్మీ, జగిత్యాల ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు లావణ్య, జానకి, ప్రధానోపాధ్యాయుడు రమేష్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● బీర్‌పూర్: బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి, చిన్న కొల్వాయి గ్రామాలతో పాటు తదితర గ్రామాలలో గురువారం ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాల్లో భాగంగా గురువారం ర్యాలీలు నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీల వద్ద ప్రతిజ్ఞ చేశారు. నేటి నుండి ప్రారంభమైన బడిబాట కార్యక్రమాలు ఈ నెల 19 వరకు నిర్వహిస్తారని ఇన్‌చార్జ్ ఎంఈవో ఎ. శ్రీనివాస్ తెలిపారు. ఈ బడిబాట కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● మల్యాల : మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్కులు, దుస్తులు అందించడం జరుగుతుందని అన్నారు. దీంతో పాటు నాణ్యమైన బోధన ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీలు చేశారు. మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ ఉపాధ్యాయులు, ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, స్వశక్తి మహిళలు పాల్గొన్నారు.

● పెగడపల్లి: బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పెగడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బతికెపల్లి, పెగడపల్లి గ్రామాలలో బడిబాట కార్యక్రమంలో పాల్గొని పిల్లలను పనిలో కాదు బడిలో చేర్పిస్తాం అంటూ తల్లిదండ్రుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులతో పాటు నాణ్యమైన ఉచిత విద్యను అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులలోనే చేర్పించాలని కోరారు. కార్యక్రమాలలో ఎంఈవో శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

● ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు బడి బాట ప్రతిజ్ఞ చేసి, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే విద్య, సదుపాయాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొలిచాల శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొండవేని మమత, ఉపాధ్యాయులు రావులపెల్లి శ్రీనివాస్, గుండి శంకర్, పుష్పలత, చిలువేరి కవిత, గొల్లపెల్లి గణేష్, దహెగాం గణేష్, స్వప్న, నామ్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

●వెల్గటూర్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో గురువారం ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఆట పాటలతో కూడిన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులు, యూనిఫాంలు విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్లు, పంచాయితీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

● కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాలలో బడిబాట అవగాహన ర్యాలీలు ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల వివరాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలను బడికి పంపే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేసారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే వసతులను సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామాల కార్యధర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కథలాపూర్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. మండలంలోని దూలూరు, సిరికొండ గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించిన అనంతరం ఇంటింటికీ తిరిగారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా విద్యార్థులను అడ్మిషన్ చేసుకున్నారు.



వెల్గటూర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



సిరికొండలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



మల్యాలలో బడిబాట కార్యక్రమం



పెగడపల్లి మండలం బతికెపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో



ధర్మపురి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో

ఆత్మరక్షణ విద్యతో ఆత్మవిశ్వాసం

● జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీలిమ

జగిత్యాల అర్బన్, జూన్ 6: ఆత్మరక్షణ విద్యతోనే ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి నీలిమ అన్నారు. జిల్లా కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం వేసవి శిక్షణ శిబిరంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థులకు కలర్ బెల్ట్ అప్‌గ్రేడింగ్ టెస్ట్, సర్టిఫికెట్స్‌ల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నీలిమ హాజరై విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జడ్జి నీలిమ మాట్లాడుతూ ఈ వేసవి సెలవులలో విద్యార్థినీ, విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా కరాటే నేర్చుకోవడం సంతోషదాయకమన్నారు. కరాటే అనేది ఆత్మరక్షణ విద్య అని, దీన్ని నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవడమే కాకుండా ఇతరులను రక్షించే విధంగా తయారవ్వాలన్నారు. ప్రస్తుతం మహిళలపై, చిన్న పిల్లలపై సమాజంలో జరుగుతున్న అఘాయిత్యాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, కోచ్ మర్రిపెల్లి శ్రీనివాస్, అనంతుల కాంతారావు, మర్రిపెల్లి లింగయ్య తో పాటు శిక్షణార్థులు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన సర్టిఫికెట్లతో విద్యార్థులు

'బీజేపీకి ప్రజల్లో ఆదరణ'

మెట్‌పల్లి రూరల్, జూన్ 6: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి అండగా నిలిచారని పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా బరిలో ఉన్న ఎంపీ ధర్మపురి అరవింద్‌కు అండగా నిలిచారన్నారు. ఎన్నడూ లేని విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే అభివృద్ధి సాధ్యమని భావించి బీజేపీకి మెజార్టీ అందించిన ప్రజలకు ఎంపీ అరవింద్ సహకారంతో ప్రజలకు అండగా ఉంటానన్నారు. ఎంపీ అరవింద్ సహకారంతో మండల అభివృద్ధే లక్ష్యంగా బీజేపీ పార్టీ నాయకులు కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

మల్యాల, జూన్ 6: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పలు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ రవళి అధికారులకు సూచించారు. 'నత్తనడకన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో మండలంలోని ముత్యంపేట, కొండగట్టులోని ప్రభుత్వ పాఠశాలల్లో పనులను ఎంపీపీ పరిశీలించారు. పనులను నాణ్యతతో పాఠశాలల ప్రారంభంలోపు పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఇబ్రహీం నాయకులు ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, వంశీధర్, జగదీశ్వర్ తదితరులు ఉన్నారు

ధర్మపురిలో శని జయంతి వేడుకలు

ధర్మపురి, జూన్ 6: ధర్మపురి క్షేత్రంలో శని జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ శని దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనేక మంది భక్తులు శని దేవుడికి తైలం పోసి భక్తి శ్రద్దలతో పూజించి దర్శనం చేసుకున్నారు. తైలం పోసి పూజిస్తే సకల కష్టాలు తొలగి పోతాయని నమ్మకం.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పరిశీలించిన ట్రాన్స్‌కో ఎస్ఈ

ధర్మపురి, జూన్ 6: ధర్మపురి సెక్షన్ పరిధిలో గల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ధర్మపురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మే నెలలో విద్యుత్ అంతరాయం ఎక్కువగా కావడం వల్ల తనిఖీ చేశారు. లాగ్ బుక్, వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్‌ల లోని రిలేలలోని అంతరాయం వివరాలను ఆయన పరిశీలించారు. సబ్‌స్టేషన్ పరిధిలో గల విద్యుత్ వినియోగదారులకు ఎన్ని సార్లు, ఎంత సమయం అంతరాయాలు ఏర్పడ్డాయని ఆయన పరిశీలించారు. లైన్‌ల మీద అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు మాత్రమే తొలగించాలని ఆయన సూచించారు. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్‌ను అందించాలని ధర్మపురి, నేరెళ్ల ఏఈలను ఆయన ఆదేశించారు. అటు తరువాత పెద్దనక్కలపేట సబ్‌స్టేషన్ పరిధిలో గల అంతరాయాలు కూడ పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందించారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

వెల్గటూర్, జూన్ 6: ఖరీఫ్ సీజన్‌లో రైతులు వివిధ రకాల విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. రైతులు కల్తీ విత్తనాలు కొనుగోలు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని చెపుతున్నారు. ముఖ్యంగా రైతులు ఎక్కువగా సాగు చేసే వరి, పత్తి విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో నకిలీ విత్తనాలు గుర్తించి మోసపోకుండా చూసుకోవాలి. విత్తనాల సంచులు చిరిగినా, రంధ్రాలు పడినా, తడిచినా కొనుగోలు చేయకపోవడం మంచిది. సంచులపై ఉత్పత్తిదారుల వివరాలు, గడువు తేదీ ఉందో లేదో చూసి కొనుగోలు చేయాలి. లైసెన్స్ డీలర్ దగ్గర కాకుండా ఇతరుల దగ్గర విత్తనాలు కొని ఇబ్బందులు పడవద్దు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి నాటిన తరువాత మొలకెత్తకుంటే నష్టపోయే పరిస్థితి ఉంటుంది.



విత్తనాల సంచులు (ఫైల్)

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● ప్రభుత్వ అనుమతి ఉన్న దుకాణాదారుల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత దుకాణాదారుని నుంచి ఖచ్చితంగా రశీదు తీసుకోవాలి.

● పంట దిగుబడి వచ్చే వరకు రైతులు రశీదు భద్రపరుచుకోవాలి. రశీదు మీద దుకాణం ముద్ర ఉండేలా చూసుకోవాలి. రశీదు మీద విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్ నంబరు, లాట్ నంబరు వివరాలు చూసుకోవాలి.

● విత్తనాల మొలక శాతం, తేమ శాతం దుకాణాదారులను ఖచ్చితంగా అడగాలి. విత్తనాల సంచులు, పాకెట్ల మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీ చూసుకోవాలి. విత్తన సంచులు చిరిగినా, రంధ్రాలు పడినా, తడిచినా కొనుగోలు చేయవద్దు. విత్తన సంచులపై ఉత్పత్తిదారుల వివరాలు, ప్రామాణికాలు ఉన్నాయో? లేదో? సరి చూసుకోవాలి.

దుకాణాదారులు పాటించాల్సిన నిబంధనలు

● దుకాణాదారులు విత్తనాల ధరల వివరాలు బోర్డుపై ఖచ్చితంగా ప్రదర్శించాలి. దుకాణంలో లభించే విత్తనాలు, రకాలు, డీలర్ల వివరాలు పొందుపరచాలి. దుకాణం లైసెన్స్ వినియోగదారులకు కనిపించేలా ప్రదర్శించాలి.

● స్టాక్ రిజిష్టర్లు, విత్తనాల వివరాల రిజిష్టర్లు నిర్వహించాలి. విత్తనాలు, ఎరువుల విక్రయాలు, ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులకు తెలియజేయాలి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

\- ఎస్సై ఉమాసాగర్



రైతులకు నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం. మార్కెట్‌లో బిటి-3 పత్తి విత్తనాలకు ఎలాంటి అనుమతి లేదు. దుకాణాదారుల అనుమతి లేని విత్తనాలు ఎట్టి పరిస్థితిలో విక్రయించవద్దు. ఎవరైనా గ్రామాలలోకి వచ్చి విత్తనాలు అమ్మితే వెంటనే పోలీసులకు లేదా 100 నంబరుకు కాల్ చేసి తెలపాలి.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

\- వ్యవసాయాధికారి కరుణ



రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దు. లైసెన్స్ ఉన్న డీలర్ దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలి.

రేకుల షెడ్డుపై పడిన తాటిచెట్టు .. తప్పిన ప్రమాదం

జగిత్యాలరూరల్, జూన్ 6: జగిత్యాల రూరల్ మండలంలోని రఘురాములకోట గ్రామంలో గురువారం వీచిన ఈదురుగాలులు, వర్షానికి తాటిచెట్టు విరిగి దండే రఘు అనే వ్యక్తి రేకుల షెడ్డుపై పడింది. ప్రమాదంలో ఇంటి బాత్రూమ్ గోడకూలి, తలుపు ఊడిపడింది. ఇంటిపై కప్పు దెబ్బతిన్నది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవండంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. తనను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితుడు కోరారు.



రేకులషెడ్డుపై విగిరిపడిన తాటిచెట్టు